నేడు అమ్మవారి చీరల వేలం

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని 18 వ వార్డులో పోచమ్మ తల్లి దేవాలయంలో బుధవారం సాయంత్రం 4:50 నిమిషాలకు అన్నదాన కార్యక్రమం జరుగునుందని ఆలయ కమిటీ పేర్కొంది. అన్నదానం అనంతరం అమ్మవారి చీరల వేలం పాట కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు



కుత్బుల్లాపూర్: ఆషాఢమాస బోనాల పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధాన ఆలయాల్లో భారీ ఏర్పాట్లు జరిగాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం రావినారాయణరెడ్డినగర్‌లోని గాలిపోచమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో ఆయనను ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, నర్సింహ, శ్రీను, గణపతి రాయుడు, రాజు, రావు రమేష్, శ్రీకాంత్, శంకర్, ఎల్లయ్య, అంజమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో నల్ల పోచమ్మ, మహంకాళి ఆలయంలో బోనాల సందర్భంగా భక్తులు అమ్మవార్లకు ఒడి బియ్యం సమర్పించారు. ఆ బియ్యంతో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కొలుకుల జగన్, స్థానికులు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌డబ్ల్యూటీ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా రషీద్



కుత్బుల్లాపూర్: ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ (ఐహెచ్‌ఆర్‌డబ్ల్యూటీ) మేడ్చల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కుత్బుల్లాపూర్‌కు చెందిన మహ్మద్ రషీద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల హక్కులు, వారిని న్యాయం అందేలా ఐహెచ్‌ఆర్‌డబ్ల్యూటీ పని చేస్తుందన్నారు.

స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న మహిళా గ్రూపు సభ్యులు తదితరులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ, మెప్మా ఆధ్వర్యంలో గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్వయం సహాయక మహిళా గ్రూపు సభ్యులు, మున్సిపల్ సిబ్బందికి కంటి, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా మహిళా సంఘాల సభ్యులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో సభ్యులు తయారు చేసిన జ్యూట్ బ్యాగ్స్, మహిళలకు సంబంధించిన వస్తువులు, స్ట్రీట్ వెండర్స్, తయారు చేసిన తినుబండరాల ఉత్పత్తుల ప్రదర్శించారు. మహిళలు ప్రభుత్వ సహకారంతో వ్యాపారాల్లో సైతం రాణిస్తూ మరొకరికి ఉపాధి కల్పించే విధంగా ఉండాలని మెప్మా సీఓ మంజుల అన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు అనేక విధాలుగా తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, ఆర్‌పీలు రాణి, మల్లేశ్వరి, అరుణ, నాగమణి, ఆదిలక్ష్మి, మౌలా బి, మెప్మా సంఘాల సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎంకు ఘన నివాళి



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు



సుందరయ్య భవన్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: కేరళ ముఖ్యమంత్రిగా, సీపీఐ(ఎం) వ్యవస్థాపక సభ్యులుగా బాధ్యతలు నిర్వహించిన కమ్యూనిస్టు యోధుడు వీఎస్ అచ్యుతానందన్ మహోన్నత ఉద్యమాల స్ఫూర్తి ప్రదాతని ఆ పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. షాపూర్‌నగర్‌లో మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రావుల స్వాతి, పసుల అంజయ్య, దేవదానం, కరుణాకర్, మల్లారెడ్డి, నర్సింలు, శీను, భాష తిమ్మప్ప, యాదవ రెడ్డి, సాధులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

నిజాంపేట్: కమ్యూనిస్టు యోధుడు, కేరళ మాజీ సీఎం వీ.ఎస్.అచ్యుతానందన్ మృతి పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సీపీఎం కార్యదర్శి బి.వెంకటరామయ్య అన్నారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ సుందరయ్య భవన్‌లో వి.ఎస్.అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలేసి బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కేరళ అసెంబ్లీకి 7సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, రెండు పర్యాయాలు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకుఉల సంతోష్, మండల నాయకులు ఎం.చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు, నాయకులు అక్బర్, మల్లేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సుభాష్‌నగర్: ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకున్న ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కృష్ణ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన అజీముద్దీన్ (50), హసీనాబీ దంపతులు కొన్ని సంవత్సరాలు క్రితం గాజుల రామారం డివిజన్ రావినారాయణరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్నారు. అజీముద్దీన్ కూలి పనులు చేస్తూ ఉంటాడు. ఇటీవల తాగుడు బానిసైన అజీముద్దీన్ సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఓ వైపు కుటుంబ సభ్యులు అతని కోసం రాత్రి మొత్తం గాలించారు. మంగళవారం మెట్‌కాని గూడలోని ఓ చెట్టుకు అజీముద్దీన్ ఉరివేసుకొని ఉండగా.. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతునికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: డ్రైనేజీ సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, త్వరితగతిన పరిష్కరించాలని బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ఎస్.ప్రసాద్ రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. 21వ డివిజన్‌లోని శుభంకరి దేవాలయం దగ్గర డ్రైనేజీ వాటర్ పొంగిపొర్లుతున్న కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

గీతాంజలి హైస్కూల్‌లో జాతీయ పతాక దినోత్సవం



కుత్బుల్లాపూర్: జాతీయ పతాక దినోత్సవాన్ని మంగళవారం సూరారం డివిజన్, రాజీవ్‌గాంధీనగర్‌లోని గీతాంజలి హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే మాట్లాడుతూ.. మన తెలుగువారైన పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని రాజ్యాంగ సభ జూలై 22 1947న ఆమోదించిందన్నారు. కాషాయం త్యాగానికి, తెలుపు శాంతికి, ఆకుపచ్చ అభివృద్ధికి గుర్తు అని అన్నారు. అశోక చక్రం ధర్మం, న్యాయం, చలానాశీలతకు నిదర్శనమని, 24 రేఖలు కళాచక్రానికి సూచన అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ మహిపాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం నటరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయోత్సవ దివస్ పోస్టర్ ఆవిష్కరణ



సుభాష్‌నగర్: కార్గిల్ విజయ దివస్‌ను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుల సేవల గౌరవార్థం షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి కట్టమైసమ్మ ఆలయం వరకు 5కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు గిరి వర్ధన్‌రెడ్డి, విగ్నేష్, నటరాజ్‌గౌడ్, డివిజన్ల అధ్యక్షులు కేశవ్‌యాదవ్, రాజు, కట్ట కుమార్, రాజేష్‌చారి, విజయేందర్ రెడ్డి, మణికంఠ, పున్నారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, తిరుపతి దాసు, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు

కుంగిన డ్రైనేజీ మ్యాన్‌హోల్



రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్లపై భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ధ్వంసమైనా, భూమిలోకి కుంగినా పట్టించునే నాథుడే కరువయ్యారు. జలమండలి ఆధ్వర్యంలో తాగునీటి పైపులైన్లు, భూగర్భ డ్రైనేజీ లైన్ల నిర్వహణ కొనసాగుతోంది. అయితే పలు చోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు కుంగినా రోజుల తరబడి వాటిని మార్చడం లేదు. దీంతో వాహనదారులు వాటిని గమనించక అందులో పడి గాయాల పాలవుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ సంజయ్‌గాంధీనగర్ అంబేడ్కర్ విగ్రహం నుండి హిందూ శ్మశాన వాటికకు వెళ్లే దారిలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత కుంగింది. నెల రోజులుగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో స్థానికులు ప్రమాద సూచికగా అందులో ఇనుపరాడ్డును ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా కుంగిన మ్యాన్‌హోల్ మూతను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

రెండోరోజు వార్షికోత్సవ పూజలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు మూలమంత్ర అనుష్ఠానం, అష్టోత్తర సుగంధ ద్రవ్యాలతో మూలవిరాట్‌కు 108 కలశాలలో మహాకుంభాభిషేకం, అవాహిత దేవాతా హోమాలు, సాయంత్రం కట్టమైసమ్మకు లక్ష పుష్పార్చన, వేదస్వస్తి రాజోపచార సేవ తదితర కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం చివరి రోజు మహాచండి హవనం, అష్టభైరవ బలి, మహా బలిప్రదానం తదితర పూజా కార్యక్రమాలుంటాయని ఆలయ కమిటీ పేర్కొంది.

నిషేధిత ప్లాస్టిక్ వాడితే చర్యలు



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు నంబర్ 14లో చిల్డ్రన్స్ పార్క్‌లో మొక్కలు నాటారు. అలాగే వార్డు నంబర్ 1లో వివిధ షాపుల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన డ్రైవ్ నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడిన షాపులకు జరిమానాలు విధించారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసి మున్సిపల్ వాహనానికి అప్పగించే విధంగా డోర్ టూ డోర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్‌ను వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలలో ప్రవేశ దరఖాస్తుల ఆహ్వానం

కుత్బుల్లాపూర్: ఐటీఐ, ఏటీసీలలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగవకాశాలు మెండుగా ఉన్నాయని మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ హనుమా నాయక్ పేర్కొన్నారు. మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన అధునాత శిక్షణ సెంటర్‌లో మొత్తం 6 కోర్సుల్లో 172 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఇందులో మొదటి విడుతగా 36 సీట్లను భర్తీ చేశామన్నారు. ఏటీసీ, ఐటీఐ విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రెనింగ్ ఇస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఐటీఐలో 308 సీట్లకు గాను 108 సీట్లు భర్తీ అయ్యాయని, ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ పరిశ్రమల్లో ఉద్యోగవకాశాలు ఉన్నాయని తెలిపారు.